

**వెన్నుపోటు పార్టీ మోసాన్ని బీసీలు గుర్తించాలి**

'వెన్నుపోటు పార్టీ వంచనపై బీసీ గర్జన' పేరిట రాజమహేంద్రవరం రూరల్ కాతేరులోని వెంకటాద్రి గార్డెన్స్‌లో ఆదివారం ఉదయం 10 గంటలకు సమావేశం నిర్వహిస్తున్నారు.

8లో



**సుందరీకరణం**

కూటమి నాయకుల మధ్య అంతర్గత విభేదాలు, ఆధిపత్య పోరుతో నిడదవోలు మండలం సమిశ్రగూడెంలో అభివృద్ధి పనులకు తీవ్ర ఆటంకం ఏర్పడింది.

**డెల్టాలకు 1,400 క్యూసెక్కులు**



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు శుక్రవారం 1,400 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 200, మధ్య డెల్టాకు 200, పశ్చిమ డెల్టాకు 1,000 క్యూసెక్కుల చొప్పున వదిలారు.

## న్యూస్‌రీల్

### వైఎస్సార్ సీపీ రాష్ట్ర అనుబంధ విభాగాల్లో ప్రాధాన్యం

**సాక్షి, అమలాపురం:** వైఎస్సార్ సీపీ రాష్ట్ర అనుబంధ విభాగాల్లో జిల్లాకు పెద్దపీట వేశారు. పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర పార్టీ కమిటీ, వివిధ అనుబంధ విభాగాల్లో పదవులు భర్తీ చేస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ప్రకటన విడుదల చేసింది. ఇందులో జిల్లాకు చెందిన 9 మందికి ప్రాధాన్యం కల్పించడం విశేషం. ముమ్మిడివరానికి చెందిన నేల కిషోర్ కుమార్‌ను రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా నియమించారు. రాష్ట్ర అనుబంధ విభాగాల్లో నియమితులైన వారిలో కాలే రాజబాబు (ముమ్మిడివరం) కల్చరల్ వింగ్ జనరల్ సెక్రటరీగా, సానబోయిన మల్లికార్జునరావు (ముమ్మిడివరం) బీసీ సెల్ జనరల్ సెక్రటరీగా, జన శంకరరావు (రాజోలు) వీవర్స్ వింగ్ జనరల్ సెక్రటరీగా, కొరెల్లా రమేష్ (అమలాపురం) వీవర్స్ వింగ్ సెక్రటరీగా, ముదునూరి వీవీ సత్యసుబ్బరాజు (ముమ్మిడివరం) వాణిజ్య విభాగం సెక్రటరీగా, దంగేటి రుద్ర, బొంతు గోవిందశెట్టి (అమలాపురం) పంచాయతీ రాజ్ వింగ్ సెక్రటరీలుగా, కుడుపూడి శివశంకరరావు (ముమ్మిడివరం) పంచాయతీరాజ్ వింగ్ జాయింట్ సెక్రటరీగా, చప్పిడి వెంకటేశ్వరరావు (అమలాపురం) వలంటీర్స్ వింగ్ సెక్రటరీలుగా నియమితులయ్యారు.

### కాకుమానుకు నివాళి



కాకుమాను రాజశేఖర్ పార్థివదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్

**అల్లవరం:** గుంటూరులోని శాప్ కార్యాలయం వద్ద నిర్వహించిన నిరసన కార్యక్రమంలో పాల్గొని గుండెపోటుకు గురై మృతి చెందిన వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కాకుమాను రాజశేఖర్ పార్థివదేహాన్ని ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ సందర్శించారు. ఒంగోలులోని ఆయన నివాసం వద్ద రాజశేఖర్ పార్థవదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రాజశేఖర్ మృతి పార్టీకి తీరని లోటుగా, పార్టీ కోసం నిస్వార్థంగా పని చేశారని ఇజ్రాయిల్ కన్నీటి పర్యంతమయ్యారు. ఆయన వెంట ఏపీ ఎస్సీ సెల్ కార్యదర్శి పలివెల సుధాకర్, వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా జిల్లా కార్యదర్శి ఆకుమర్తి రమేష్, సోషల్ మీడియా ఎగ్జిక్యూటివ్ మెంబర్ మంద దుర్గారావు, ఆకుమర్తి దుర్గారావు, కొండేటి సురేష్‌బాబు ఉన్నారు.

### వీఆర్‌ఏల వినూత్న నిరసన



భిక్షాటన చేస్తూ వీఆర్‌ఏల నిరసన

**కొత్తపేట:** స్థానిక పాత తహసీల్దార్ కార్యాలయం వద్ద మండల వీఆర్‌ఏలు వివిధ రీతుల్లో నిరసన తెలియజేసిన విషయం తెలిసిందే. 10వ రోజు మెయిన్ రోడ్డులో భిక్షాటన చేస్తూ నిరసన తెలిపారు. తమ డిమాండ్లు పరిష్కరించాలని సమ్మె చేస్తున్నా.. ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. రోడ్డున పడ్డాం.. ఆకలితో అలమటిస్తున్నాం.. భిక్షం వేయండి బాబూ అంటూ వ్యాపారులను వీఆర్‌ఏలు వేడుకుంటూ నిరసన తెలిపారు. మండల సంఘ అధ్యక్షుడు కె.భీమశంకరం, ప్రధాన కార్యదర్శి పిల్లంగోరు బాలు, కోశాధికారి ఎస్.నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

### కొత్త కార్యవర్గం ఎన్నిక



జిల్లా ఎల్‌టీపీ ఇంజినీర్ల కార్యవర్గ ప్రతినిధులు

**అమలాపురం టౌన్:** జిల్లా లైసెన్స్ టెక్నికల్ పర్సన్ (ఎల్‌టీపీ) ఇంజినీర్ల సంఘం సర్వసభ్య సమావేశం స్థానిక యెండూరి కన్వెన్షన్ హాలులో శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా సంఘ నూతన కార్యవరాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా సంఘ అధ్యక్షుడిగా ఐ.బాలకృష్ణ, కార్యదర్శిగా మలిశెట్టి నాగేశ్వరరావు, కోశాధికారిగా సుదర్శనం శ్రీకాంత్‌లను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గాన్ని వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ ఎల్‌టీపీ ఏపీ జనరల్ సెక్రటరీ పీవీఎస్ మాణిక్యాలరావు అభినందించారు. సమావేశంలో రాష్ట్ర కార్యవర్గం నుంచి అరిగెల సుబ్బారావు, ఏడిద దొరబాబు, కొవ్వూరి రామచంద్రారెడ్డి, శ్రీనివాసరావు, వి.కన్నబాబు, కృష్ణంరాజు తదితరులు ప్రసంగించారు.

### నేడు '5కే రెడ్ రన్' మారథాన్

**అమలాపురం రూరల్:** యువత, ప్రజల్లో హెచ్ఐవీ, ఎయిడ్స్, లైంగిక సంక్రమిత వ్యాధులపై సమగ్ర అవగాహన కల్పించేందుకు అమలాపురంలో శనివారం '5కే రెడ్ రన్' మారథాన్ నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ తెలిపారు. ఈ మారథాన్ శనివారం ఉదయం 6 గంటలకు భట్నవిల్లి హైవే వద్ద ప్రారంభమై, ఐదు కిలోమీటర్ల మేర కొనసాగుతుందని తెలిపారు.

# ఇది సొంత డబ్బా!





చంద్రబాబు ప్రభుత్వానికి ప్రచారం ఎక్కువ, పనులు తక్కువ అనేది అందరికీ తెలిసిందే. స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధమవుతున్న వేళ ప్రభుత్వ వ్యతిరేకతను సానుకూలంగా మార్చుకునేందుకు ప్రభుత్వం కొత్త ఎత్తుగడ వేసింది. గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలును పట్టించుకోకుండా, ఇప్పుడేమో ఏదో చేసేసినట్లు సొంత డబ్బా కొట్టుకోవడానికి రంగం సిద్ధం చేసుకుంది. దీని కోసం సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లను ప్రచారానికి వినియోగించుకోవాలని రాష్ట్ర మంత్రివర్గం బుధవారం ఆమోదం తెలిపింది. దీనిపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

- సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ల ఎంప్యానెల్‌కు కేబినెట్ ఆమోదం
- ప్రభుత్వ ప్రచారానికి ప్రజాధనం వినియోగంపై విమర్శలు
- ఆడబిడ్డ నిధి, నిరుద్యోగ భృతికి నిధులు లేవన్న సర్కారు
- సొంత ప్రచారానికి డబ్బు ఎలా వచ్చిందని ప్రజల ప్రశ్నలు

**సాక్షి, అమలాపురం:** ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల అమలుకు చంద్రబాబు సర్కారు మొండిచేయి చూపింది. డబ్బులు లేవంటూ చేతులెత్తేసింది. ఇప్పుడేమో ప్రభుత్వ కార్యక్రమాల ప్రచారానికి ప్రజాధనం ఉపయోగించడం వెనుక పెద్ద స్కెచ్ వేసింది. దీనికి గాను సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ల ఎంప్యానెల్ చేసుకునే నిర్ణయం చర్చనీయాంశంగా మారింది. సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్, ఎక్స్ తదితర వేదికల్లో కంటెంట్ సృష్టించే వారిని ఎంపిక చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. వారి రీచ్, కంటెంట్ ఆధారంగా చెల్లింపులు చేయనుంది. అయితే అధికార పార్టీకి అనుకూలంగా ఉండే సోషల్ మీడియా వర్గాలకు, మరీ ముఖ్యంగా ఐటీడీపీలో పనిచేసే వారికి ప్రయోజనం కల్పించే అవకాశం ఉందంటూ విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కొన్ని రకాల కంటెంట్‌కు రూ.15 వేల వరకు, నెల వారీగా గరిష్టంగా రూ.1.50 లక్షల వరకు చెల్లింపులు ఉండనున్నట్లు సమాచారం.

**హామీల సంగతేంటి?**

18–60 ఏళ్ల మహిళలకు నెలకు రూ.1,500 ఆడబిడ్డ నిధి, నిరుద్యోగులకు రూ.3 వేల భృతి, 50 ఏళ్లు దాటిన బీసీ, ఎస్సీ, ఎస్టీలకు పింఛన్ వంటి హామీల అమలుపై ఎదురుచూపులు కొనసాగుతున్నాయి. కొత్త పింఛన్లు, రేషన్ కార్డుల మంజూరుపైనా స్పష్టత రావాల్సి ఉంది. ఒకవైపు హామీల అమలుపై ప్రశ్నలు.. మరోవైపు ప్రభుత్వ ప్రచారానికి ప్రజాధనం ఖర్చు చేయడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**ప్రశ్నిస్తే కేసులు పెడుతున్నారు కదా..**



చంద్రబాబు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్ల మీద కేసులు పెడుతున్నారు. అదే వారికి అనుకూలంగా ప్రచారం చేస్తే డబ్బులు ఇవ్వడానికి సిద్ధపడుతున్నారు. ఇదెక్కడి న్యాయం. ఇలాంటి విధానం ఏ రాష్ట్రంలోనూ లేదు.

–పోతురాజు బాబూరావు, గొల్లపాలెం, కాజులూరు మండలం

**ప్రజాధనాన్ని దోచిపెట్టేందుకే..**



సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ల పేరుతో టీడీపీ కార్యకర్తలకు ప్రజాధనం కట్టబెట్టే ప్రయత్నం దారుణం. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు నిరుద్యోగ భృతి, కొత్త పింఛన్లను ముందుగా అర్హులకు అందించాలి. ప్రజలకు ప్రయోజనం లేని నిర్ణయాలను మానుకోవాలి.

– కాంఢ్రేగుల దుర్గ, అంబాజీపేట

**పథకాలకు సొమ్ములు లేవంటూ..**



సంక్షేమ పథకాలకు నిధులు లేవంటున్న ప్రభుత్వం సోషల్ మీడియా ప్రచారానికి ప్రత్యేక పాలసీ తీసుకురావడం దారుణం. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజాధనాన్ని ప్రచారానికి వినియోగించడం సరికాదు. ఈ నిర్ణయం సరైంది కాదు.

– ఎస్.రాంజీ హర్షవర్ధన్, బీటెక్, కొమరగిరి, ఐ.పోలవరం మండలం

**ముందు పథకాలు అమలు చేయండి**



ఎన్నికల ముందు చాలా పథకాలు అమలు చేస్తామన్నారు కదా. ముందు వాటిని ప్రజలకు అందించడం ముఖ్యం. పింఛన్ల కోసం ఇప్పుడు దరఖాస్తులు అడిగారు. ఎప్పుడు ఇస్తారనేది మాత్రం చెప్పడం లేదు. ప్రభుత్వం ప్రజా ప్రయోజన కార్యక్రమాలు అమలు చేయాలి.

–పితాని ఏసుబాబు, సూర్యానగర్, అమలాపురం మున్సిపాలిటీ

**ఆడబిడ్డ నిధి ఎప్పుడిస్తావ్ బాబూ..**



ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆడబిడ్డ నిధి, 50 ఏళ్లకే పింఛన్ వంటివి అమలు చేయకుండా సోషల్ మీడియా ప్రచారానికి ప్రజాధనం ఖర్చు చేయడం దారుణం. గతంలో డ్వాక్రా రుణమాఫీ అని ఓట్లేయించుకుని మోసం చేశారు. ఇప్పుడు ఆడబిడ్డ పేరుతో మరోసారి మోసం చేస్తున్నారు.

– కర్రా లక్ష్మి, కొత్తపేట

## మద్యం దుకాణాల లైసెన్స్‌లకు నోటిఫికేషన్

- 1 వరకూ దరఖాస్తుల స్వీకరణ
- 5న లాటరీ విధానంలో ఎంపిక



**అమలాపురం టౌన్:** జిల్లాలోని మొత్తం 146 మద్యం దుకాణాలకు 12 దుకాణాలు తప్ప మిగిలిన 134 దుకాణాలు రెన్యువల్ అయ్యాయి. 12 దుకాణాలు రెన్యూవల్ కాకపోవటంతో ఎక్సైజ్ శాఖ ఆ దుకాణాల లైసెన్స్‌ల మంజూరుకు నోటిఫికేషన్ జారీ చేసిందని జిల్లా ఎక్సైజ్ అధికారి ఆర్‌ఎస్ కుమారేశ్వరరావు తెలిపారు. 2026–27 సంవత్సరానికి రెన్యువల్ అనంతరం 12 దుకాణాల లైసెన్స్‌ల మంజూరుకు ఈ నోటిఫిషన్ విడుదలైందన్నారు. లైసెన్స్‌ల కాల పరిమితి 2026 అక్టోబర్ 1 నుంచి 2027 సెప్టెంబర్ 30వ తేదీ వరకూ ఉంటుందని అన్నారు. ఆసక్తి గల దరఖాస్తుదారులు వచ్చే నెల 1వ తేదీ రాత్రి 12 గంటలలోపు ఆన్‌లైన్ లేకుంటే, ఆఫ్‌లైన్ విధానంలో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. ఒక్కో దరఖాస్తుకు రూ. 3,00,000 దరఖాస్తు రుసుం ఉంటుందని, ఈ మొత్తాన్ని జిల్లా ఎక్సైజ్ అధికారి పేరుతో చెల్లించాలన్నారు. అదనంగా రూ.1000 ప్రాసెసింగ్ ఫీజును కమిషనర్, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్, ఏపీ మంగళగిరి పేరుతో తీయాలన్నారు. అమలాపురం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో అమలాపురం 1, కొత్తపేట ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో కొత్తపేట 3 దుకాణాలు, రాజోలు ఎక్సైజ్ స్టేషన్‌లో రాజోలు 2 దుకాణాలు, రామచంద్రపురం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో రామచంద్రపురం 6 దుకాణాలు, ఆలమూరు ఎక్సైజ్ స్టేషన్‌లో ఆలమూరులో ఒక దుకాణానికి దరఖాస్తులు సమర్పించాలన్నారు. దరఖాస్తుల పరిశీలన వచ్చే నెల 5వ తేదీ ఉదయం 8 గంటలకు అమలాపురం కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో జిల్లాలోని 12 దుకాణాలకు లాటరీ ద్వారా ఎంపిక ఉంటుంది. జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ సమక్షంలో ఈ ప్రక్రియ నిర్వహిస్తారు. కోనసీమ జిల్లాలో 12 దుకాణాలకు లైసెన్స్‌లు మంజూరు కావాల్సి ఉండగా, ఒక దుకాణం మాత్రం తూర్పు గోదావరి జిల్లా ఎక్సైజ్ పరిధిలో ఆలమూరు మండలం మద్యం లైసెన్స్ దుకాణం ఉందని కుమారేశ్వరరావు వివరించారు. జిల్లా ఎక్సైజ్ శాఖ గణంకాల ఆధారంగా మొత్తం 13 దుకాణాలుగా నమోదు చేశారని తెలిపారు.

## జిల్లా పరిషత్ కార్యకలాపాలు ప్రారంభం

**సాక్షి, అమలాపురం:** కోనసీమలో జిల్లా పరిషత్ కార్యకలాపాలు శుక్రవారం నుంచి అధికారికంగా ప్రారంభమయ్యాయి. ఇప్పటివరకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో కొనసాగిన పరిపాలనకు తెరపడి సొంత జిల్లా పరిషత్ ఏర్పాటుతో స్థానిక పాలనకు కొత్త అధ్యాయం మొదలైంది. అమలాపురం మండల పరిషత్ కార్యాలయం పైభాగంలోని బ్లాక్‌లో నూతన జిల్లా పరిషత్ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల మంజూరు చేసిన పోస్టులకు అనుగుణంగా జిల్లాకు కేటాయించిన సీఈఓ, డీఈ, ఇతర సెక్షన్ల సిబ్బంది శుక్రవారం సాయంత్రం విధుల్లో చేరారు. జిల్లాలో 19 మండల పరిషత్తులతో కొత్త జిల్లా పరిషత్ ఏర్పడింది. ఇప్పటి వరకు అన్ని ఫైళ్లు కాకినాడ జిల్లా పరిషత్‌కే వెళ్లాల్సి వచ్చేది. ఇక నుంచి అన్ని అభివృద్ధి పనులు, పంచాయతీల పాలన, ఉపాధి హామీ, పారిశుధ్యం, వీధి దీపాలు, నిధుల కేటాయింపులు వంటి అంశాలన్నీ అమలాపురం కేంద్రంగానే పర్యవేక్షించనున్నారు. నూతన జిల్లా పరిషత్ ఏర్పాటు వల్ల మండల అధికారులు, సర్పంచులు కాకినాడ వరకు వెళ్లాల్సిన అవసరం తప్పిందని, త్వరితగతిన పనులు పూర్తవుతాయని సిబ్బంది తెలిపారు.



నూతన జిల్లా పరిషత్ కార్యాలయం

## చీరమేను బకెట్ రూ. 26 వేలు



యానాం మార్కెట్‌లో చీరమేను

**యానాం:** గోదారోళ్లకు పులస తర్వాత చీరమేను చేప రుచేవేరు. చిన్న సైజులో ఉండే చీరమేను చేప పేరు చెబితే అందరూ లొట్టలేసుకుని తింటారు. సీజనల్ చేప కావడంతో ముఖ్యంగా సెప్టెంబర్, అక్టోబర్, నవంబర్ నెలల్లో శీతాకాలం ప్రారంభం సమయంలో ఇది గోదావరి నదీ ముఖద్వారం వద్ద అంటే గోదావరి (తీపినీరు), సముద్రం (ఉప్పునీరు) కలిసే ప్రదేశాల్లో వాటికి ఆక్సిజన్ ఎక్కువగా ఉండే బ్రాకిస్ వాటర్‌లో లభిస్తుంది. చీరమేనును సోల, సేరు, తవ్వ, గ్లాసు, బకెట్ కొలతల్లో అమ్ముతుంటారు. యానాం మార్కెట్‌లో లభిస్తుండటంతో మాంసాహార ప్రియులు చీరమేను కొనుగోలుకు ఆసక్తి కనబరుస్తున్నారు. శుక్రవారం ప్లాస్టిక్ బకెట్‌లో ఉన్న 10 కిలోల చీరమేను ధర రూ.26 వేలకు పలికింది.

## కోనసీమ రైలు కోసం 29న రౌండ్ టేబుల్ సమావేశం

**అమలాపురం టౌన్:** కోనసీమ రైల్వే ప్రాజెక్ట్ సాధనకు అన్నివర్గాలు, సంఘాల ప్రతినిధులు సహకరించేలా ఈ నెల 29న సాయంత్రం 3 గంటలకు అమలాపురం పట్టణం కల్వకొలను వీధిలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నారు. కోనసీమ రైల్వే సాధన సమితి (కేఆర్‌ఎస్‌ఎస్) ఆధ్వర్యంలో జరగనున్న ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో చాంబర్ ఆఫ్ కామర్స్, వ్యాపార సంఘాల ప్రతినిధులు, కొబ్బరి వ్యాపారులు, ఆటో, ట్యాక్సీ తదితర సంఘాల ప్రతినిధులు, లాయర్లు, డాక్టర్లు, టీచర్లు, వాకర్స్, డ్వాకా సంఘాల నాయకురాళ్లు ఇలా అన్ని వర్గాల వారు పాల్గొంటారని ఆ సమితి స్టీరింగ్ కమిటీ కన్వీనర్ డాక్టర్ ఈఆర్ సుబ్రహ్మణ్యం తెలిపారు. రైల్వే ప్రాజెక్టుకు పునాది రాయి పడి రెండున్నర దశాబ్దాలు కావస్తున్నా కోనసీమకు రైలు రాలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సమితి స్టీరింగ్ కమిటీ ప్రతినిధులైన ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు, పట్టణ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కల్వకొలను తాతాజీ తదితరుల ఆధ్వర్యంలో ఈ సమావేశం జరుగుతుందని చెప్పారు.

## గణపతి ఉత్సవ కమిటీకి ముస్లింల సత్కారం

**కొత్తపేట:** స్థానిక చింతామణి గణపతి శతాబ్ది ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించిన ఆర్యవైశ్య సంఘ నాయకులను ముస్లిం సంఘ నాయకులు ఘనంగా సత్కరించారు. ఆర్యవైశ్య సంఘం నాయకుడు, ఉత్సవ కమిటీ చైర్మన్ యెండూరి పవన్‌కుమార్ తదితర ఆధ్వర్యంలో 9 రోజుల పాటు వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ మేరకు స్థానిక కమ్మిరెడ్డిపాలెం జామియా మసీద్‌లో శుక్రవారం నమాజ్ తర్వాత మండల ముస్లిం, మైనార్టీ సంఘ నాయకుడు, కళాసాహితి సభ్యుడు షేక్ గౌస్, మసీదు, షాదీఖానా కమిటీ ప్రెసిడెంట్ షేక్ కాజాబాబు ఆధ్వర్యంలో యెండూరి పవన్‌కుమార్, ఆర్యవైశ్య సంఘ సభ్యుడు, సత్యసాయి సేవా సమితి కన్వీనర్ కంకటాల సత్యనారాయణమూర్తి (కేఎస్‌ఎన్)ను ఘనంగా సత్కరించారు. కుల, మతాలు వేరైనా అందరూ కలిసిమెలిసి ఉండాలనే ఉద్దేశంతో ఈ చిరు సత్కారం చేశామని వారన్నారు.



మసీదులో కేఎస్ఎన్, పవన్‌లను సత్కరిస్తున్న గౌస్, కాజాబాబు

## వాన ఆగింది.. వరద పెరుగుతోంది



నీట మునిగిన ఆత్రేయపురం పోలీస్ స్టేషన్



భారీ వర్షాలకు అధ్వానంగా మారిన పెదపట్నం-మానేపల్లి రోడ్డు

- జిల్లాపై వాయుగుండం ప్రభావం
- రెండు రోజులు ఎడతెరిపి లేని వర్షాలు
- శుక్రవారం ఉదయం నుంచి కాస్త ఊరట

**సాక్షి, అమలాపురం:** తీవ్ర వాయుగుండం ప్రభావంతో జిల్లాను రెండున్న రోజుల పాటు వర్షం ముంచెత్తింది. మంగళవారం అర్ధరాత్రి నుంచి శుక్రవారం తెల్లవారు జాము వరకు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షం శుక్రవారం ఉదయం ఎనిమిది గంటలకు తెరిపిచ్చింది. పలుచోట్ల ఎండ కూడా రావడంతో ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు. రహదారులపై చేరిన వర్షపు నీరు క్రమంగా తగ్గుముఖం పట్టింది. అయితే వరుస వర్షాలతో పంట కాలువలు, డ్రైన్లు పొంగిపార్లడంతో లోతట్టు ప్రాంతాల్లో పరిస్థితి పూర్తిగా సాధారణం కాలేదు. జిల్లాలో గురువారం ఉదయం నుంచి శుక్రవారం ఉదయం వరకు సగటున 51.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. రామచంద్రపురంలో అత్యధికంగా 102.2 మిల్లీమీటర్లు, మలికిపురంలో అత్యల్పంగా 24.6 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. ఆత్రేయపురంలో 46.4, ఆలమూరులో 40.2, రావులపాలెంలో 64.2, కొత్తపేటలో 70.6, కె.గంగవరంలో 44.2, ఐ.పోలవరంలో 40.8, ముమ్మిడివరంలో 56.4, అయినవిల్లిలో 56.6, పి.గన్నవరంలో 39.8, అంబాజీపేటలో 49.8, మామిడికుదురులో 47.4, రాజోలులో 49.2, సఖినేటిపల్లిలో 59, అల్లవరంలో 43.4, అమలాపురంలో 39.8, ఉప్పలగుప్తంలో 55.2, కాట్రేనికోనలో 45.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

**10 వేల ఎకరాల్లో చేలల్లో ముంపు**

వరుస వర్షాలతో ఐ.పోలవరం, ముమ్మిడివరం, అల్లవరం, ఉప్పలగుప్తం, అమలాపురం, మలికిపురం, మామిడికుదురు, రాజోలు మండలాల్లో సుమారు 10 వేల ఎకరాల్లో వరి చేలు వర్షం బారినపడ్డాయి. ప్రస్తుతం పొలాల్లో నిలిచిన నీటితో పెద్దగా నష్టం లేకపోయినా.. మురుగునీటి కాలువల ద్వారా నీరు సకాలంలో బయటకు వెళ్లకపోతే పంట దెబ్బతినే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు. అయితే అమలాపురం మండలం నల్లమిల్లి, జనుపల్లిలో మాత్రం చేలు దెబ్బతినే పరిస్థితి నెలకొంది. మరోవైపు వరుసగా కురిసిన వర్షాలతో జనజీవనం కొంత స్తంభించింది. రహదారులు, లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. శుక్రవారం ఉదయం నుంచి వర్షం తెరపివ్వడంతో పరిస్థితి కొంత మెరుగుపడింది. ఈ వర్షాలు ఈ ఏడాది ఇప్పటివరకు ఉన్న వర్షాభావ పరిస్థితులకు కొంతమేర ఉపశమనం కలిగించాయని రైతులు భావిస్తున్నారు.

**పెరుగుతున్న గోదావరి**

వర్షం తగ్గుముఖం పట్టిన సమయంలో గోదావరి వరద మాత్రం క్రమంగా పెరుగుతోంది. ఈ నెల 24వ తేదీ ఉదయం ధవళేశ్వరం బ్యారేజీ వద్ద 1,37,099 క్యూసెక్కులుగా ఉన్న ఇన్‌ఫ్లో శుక్రవారం సాయంత్రం ఆరు గంటలకు 4.10 లక్షల క్యూసెక్కులకు చేరింది. దీంతో పి.గన్నవరం, అన్నంపల్లి అక్విడెక్టుల వద్ద కూడా వరద ఉధృతి పెరిగింది. భద్రాచలం వద్ద కూడా వరద ప్రవాహం పెరిగినా.. అధికారులు ముందుగా అంచనా వేసినంత వేగంగా పెరుగుదల కనిపించలేదు. ప్రస్తుత పరిస్థితులను బట్టి కోనసీమలో అంచనా వేసిన స్థాయిలో భారీ వరద వచ్చే సూచనలు కనిపించడం లేదని సాగునీటి పారుదల శాఖ అధికారులు చెబుతున్నారు. మరో 1.50 లక్షల క్యూసెక్కుల వరకు వరద పెరిగినా పరిస్థితి అదుపులోనే ఉంటుందని అంచనా వేస్తున్నారు. దీంతో గోదావరి లంక గ్రామాల ప్రజలు కొంత ఊపిరి పీల్చుకుంటున్నారు. అయినప్పటికీ వరద ప్రవాహం పెరుగుతున్న నేపథ్యంలో లోతట్టు, లంక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

**నీట మునిగిన పోలీస్ స్టేషన్**

ఆత్రేయపురం: భారీ వర్షాలకు ఆత్రేయపురం పోలీస్ స్టేషన్ నీట మునిగింది. కనీసం స్టేషన్‌కు వెళ్లడానికి వీల్లేకుండా మోకాలు లోతు నీరు చేరింది. స్టేషన్‌లోకి సైతం నీరు రావడంతో పోలీస్ సిబ్బంది రికార్డులు, కంప్యూటర్లు, ఆయుధ సామగ్రి పాడవుతుందని ఆందోళన చెందుతున్నారు. కాగా నీటిని మోటార్ల ద్వారా అల్లూరి పార్కులోని చెరువులోకి తోడుతున్నారు.

